ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ టౌన్, మార్చి 17: రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా బాన్సువాడ కాంగ్రెస్ నాయకుడు కాసుల బాల్‌రాజ్ నియమితులయ్యారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాసుల బాల్‌రాజ్‌కు ఆగ్రో పరిశ్రమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం చాలా ఆనందంగా ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆదివారం పలువురు నాయకులు, కార్యకర్తలు కాసుల బాల్‌రాజ్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


నేలకొరిగిన వరి పంట


కామారెడ్డిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట


బిచ్కుందలో నేలకొరిగిన తంబాకు పంట

వడగండ్ల బీభత్సం

- అన్నదాతలను ఆగం చేస్తున్న అకాల, వడగండ్ల వర్షాలు
- జిల్లాలో అకాల, వడగండ్ల వర్షానికి పంటలకు నష్టం
- ఈదురుగాలులకు నేలవాలిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు
- కామారెడ్డి, రామారెడ్డి, రాజంపేట, మాచారెడ్డి మండలాల్లో రాళ్ల వర్షం
- 15 మండలాలు.. 130 గ్రామాల్లో పంట నష్టం
- 20,071 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సర్వే నిర్వహించిన వ్యవసాయశాఖ
- ఎక్కువగా వరి, మొక్కజొన్న జొన్న పంటలకు నష్టం

కామారెడ్డి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అకాల, వడగండ్ల వర్షాలు, ఈదురుగాలులు అన్నదాతను ఆగమాగం చేస్తున్నాయి. శనివారం రాత్రి అకాల, వడగండ్ల వర్షాలు రైతులను అతలాకుతులం చేశాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట సరిగా చేతికి వచ్చిన సమయంలో పంటలు నేల పాలు కావడంతో రైతుల్లో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతుంది. ఈదురుగాలులకు అకాల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో రైతన్నలు నష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. సరిగా పంటలు కోతకు రావడం, ధాన్యం చేతికి అందే సమయంలో రాళ్ల వర్షం ఈదురుగాలులతో ముచ్చింది. రైతులే కాకుండా సామాన్య ప్రజలు సైతం ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలుల తాకిడికి పంట పొలాల్లోనే కాకుండా పలు కాలనీలు, గ్రామాల్లోనూ విద్యుత్ స్తంభాలు ధ్వంసం అయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారులకు అడ్డంగా చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తాడ్వాయిలో రేకులషెడ్డు కూలడంతో ఒక ఆవు మృత్యువాత పడింది. భిక్కనూర్ మండలంలోని లక్ష్మీనగర్ తండాలో ఓ రైతుకు చెందిన కూరగాయల పంటతో పాటు, పశువుల కొట్టం, ఆయన నివాసం ఉండే ఇల్లు సైతం ఈదురుగాలులకు ఎగిరిపోవడంతో తీవ్రంగా న ష్ట పో యాడు.

రెండు ఎకరాల్లో మొక్కజొన్న నేల వాలింది

- భూమయ్య, సీతారాంపూర్, దోమకొండ



సీతారాంపూర్ శివారులో మాకున్న రెండెకరాల్లో మొక్కజొన్న పంటను వేశాను. మరో రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నాను. మరికొన్ని రోజుల్లో మొక్కజొన్న పంట చేతికి వచ్చేది. ఈదురు గాలులు, వడగండ్లు, వర్షానికి మొక్కజొన్న నేల వాలింది. కంకులు దెబ్బతిన్నాయి. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం కష్టమే. నష్టపోయిన పంటకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

రైతన్నను దెబ్బతిసిన గాలివాన

కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో గాలివాన అకాల వర్షాలు రైతన్నను తీవ్రంగా దెబ్బ తీసింది. కామారెడ్డి, భిక్కనూర్, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, రామారెడ్డి, రాజంపేట, సదాశివనగర్, గాంధారి, బీర్కూర్, నస్రూల్లాబాద్, బాన్సువాడ, తాడ్వాయి, బిచ్కుంద తదితర మండలాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలు నానా బీభత్సం చేశాయి. పెద్ద ఎత్తున వడగండ్ల వర్షం పడింది. ఈదురు గాలులు, వడగండ్ల వర్షాలకు వేల ఎకరాలలో పంట లు దెబ్బతిన్నాయి. బలమైన ఈదురు గాలలు వీయడంతో మొక్కజొన్న, జొన్న పంటలు విరిగి నేల వాలాయి. వరి ఇప్పు డిప్పుడే పొట్టదశలో ఉండడం మరికొన్ని చోట్ల కోతలకు సిద్ధంగా ఉండడంతో రాళ్ల వర్షానికి ధాన్యం రాలిపోయింది. కూరగా యల పంటలకు సైతం నష్టం వాటిల్లింది.

20వేల ఎకరాల్లో పంటలకు నష్టం

జిల్లాలో కురిసిన వడగండ్ల వర్షాలు, ఈదురు గాలలుకు వేల ఎకరాల్లోనే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శనివారం కురిసిన అకాల వర్షాల వల్ల జిల్లా వ్యవసాయాధికారులు ఆదివా రం క్షేత్రస్థాయిలో పంట నష్టంపై ప్రాథమిక సర్వే నిర్వహి ంచారు. 15 మండలాల పరిధిలోని 130 గ్రామాల్లో 14,553 రైతులకు సంబంధించి 20,071 ఎకరాల్లో పంటకు నష్టం ఏర్పడినట్లు ప్రాథమిక సర్వే ద్వారా అధికారులు గుర్తించారు. ఎక్కువగా మొక్కజొన్న, వరి, జొన్న, కూరగాయల పంటలు దెబ్బ తిన్నాయి. రామారెడ్డి, దోమకొండ, తాడ్వాయి, మద్నూర్, బీర్కూర్, బాన్సువాడ, బీబీపేట, నస్రూల్లాబాద్, పాల్వం చ, బిచ్కుంద, రాజంపేట, భిక్కనూర్, గాంధారి, సదాశి వనగర్, కామారెడ్డి మండలాల పరిధిలోని సుమారు 130 గ్రామాల్లో వరి, మొక్కజొన్న, జొన్న, కూరగాయ ల పంటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు భారీ వృక్షాలు కూలిపోయి రహదారులకు అడ్డంగా పడిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలుల తాకిడికి పంట పొలాల్లోనే కాకుండా పలు కాలనీలు, గ్రామాల్లోనూ విద్యుత్ స్తం భాలు ధ్వంసం అయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అకాల వర్షాలతో కుదేలవుతున్న అన్నదాతలు

జిల్లాలో వడ గండ్లు, ఈదురు గాలులు, అకాల వర్షాలతో అన్నదాతలు కుదేలవుతున్నారు. సరిగా పంట చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వడగండ్ల వర్షాలతో వేల ఎకరాల్లో వరి పంట, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. సరిగా చేతికి వచ్చే సమయంలోనే అకాల వర్షాలు రైతుల పంటలను దెబ్బ తీస్తుండడం అధికారులు వచ్చి సర్వేలు చేస్తున్నారే తప్ప నష్టపరిహారం ఇవ్వడం లేదు. గత ఐదేళ్లలో ప్రతీ ఏడాది వానాకాలం యాసంగి సీజన్‌లో అకాల వర్షాలతో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నప్పటికీ నయాపైస నష్టపరిహారం కూడా అందలేదని రైతులు మండిపడుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కొత్త ప్రభుత్వమైనా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మూడు ఎకరాల్లో వరి ధాన్యం రాలిపోయింది

- పరశురాంలు, దోమకొండ



దోమకొండ శివారులో మూడెకరాల్లో వరి పంట సాగు చేశాను. రాత్రి కురిసిన ఈదురు గాలులు, రాళ్ల వర్షానికి వరి ధాన్యం చేనులోనే రాలిపోయింది. చేతికి వచ్చిన పంట నేలవాలడంతో తీవ్రంగా నష్టం ఏర్పడింది. రాళ్లవానతోనే ధాన్యం రాలిపోవడంతో పంటచేతికి వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి తమను ఆదుకోవాలి.


తాడ్వాయిలో ఈదురుగాలులతో గోడకూలి మృతి చెందిన ఆవు, గేదె


దోమకొండలో కూలిన విద్యుత్ స్తంభం


లక్ష్మీనగర్‌తండాలో నేలకొరిగిన కూరగాయల పంట


రెడ్డిపేటలో పడిన వడ గండ్లు

పంట నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటాం

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ
- భిక్కనూరు, దోమకొండ మండలాల్లో పంటల పరిశీలన

భిక్కనూరు/దోమకొండ, మార్చి 17: అకాల వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. ఆదివారం భిక్కనూరు, దోమకొండ మండలాల్లో ఆయన దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. భిక్కనూరు మండలంలోని లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి, రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, దోమకొండ మండలంలోని లింగుపల్లి, కుందారం, గొట్టిముక్కుల, చింతమాన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా భిక్కనూరు, రాజంపేట, దోమకొండ, కామారెడ్డి మండలాల్లో వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలతో పాటుగా కూరగాయల పంటలు, తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఇళ్లు, గుడిసెలు కూలిపోయాయని, పశువులు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మండలాల్లో ఎంతమేర ఏఏ పంటలు నష్టపోయాయో వ్యవసాయాధికారుల నుంచి పూర్తి వివరాలను తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అకాల వడగండ్ల వానకు కూలిపోయిన, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున తక్షణ సహాయం అందజేశారు. ఇళ్లు కూలిపోయిన, దెబ్బతిన్న ప్రతీ ఒక్కరికి రూ.5లక్షలు మొదటి విడతలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, దోమకొండలో కైలాస్ శ్రీనివాస్‌రావు, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గొట్టిముక్కలలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న షబ్బీర్‌అలీ

పంచమంటే పడేశారు..!

- రుక్మిణికుంటలో పడేస్తున్న వైనం
- ఎక్స్‌పైర్ కాని మందుగోలీలు అనేకం

కామారెడ్డి టౌన్, మార్చి 17: రోగులు అనారోగ్యం బారిన పడినప్పుడు వారికి బలవర్ధకంగా ఉండేందుకు వైద్యులు రిఫర్ చేసే పలు మందులను అందించాల్సిన వైద్య సిబ్బంది వాటిని అందించకుండా మురికి కాలువలు, చెత్తకుప్పల్లో పడేస్తున్నారు. ఆసుపత్రిలో ఎక్స్‌పైర్ అయిన మందులు ఉంటే వాటిని మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి కవర్లలో ప్యాక్ చేసి అందించాలి లేదంటే దూర ప్రాంతాల్లోకి తీసుకువెళ్లి గొయ్యి తీసి పూడ్చివేయాలి కానీ ఆ మందులను ఎక్కడ పడితే అక్కడ పడేయడం చేస్తున్నారు. వాటితో పాటు గడువు మరో ఏడాది కాలం ఉన్న మందులను సైతం కలిపి పారేస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రుక్మిణికుంటలో వారంలో రెండు మూడు సార్లు ఇలా ఏదో రకమైన మందును ఎక్స్‌పైర్‌తో పాటు అన్ ఎక్స్‌పైర్ మందులను సైతం పడేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. తాజాగా ఎముకల దృఢత్వానికి సంబంధించి కాలిషియం మందుగోలీలను పెద్ద ఎత్తున కుప్పలుగా పడేశారు.


రుక్మిణికుంటలో పడేసిన మందు గోలీలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఓటింగ్ శాతం పెంచాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 17: రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటర్లు 12 రకాల కార్డులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఆధార్, ఉపాధిహామీ, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్, ఎంప్లాయ్ ఐడీ, సదరం, బ్యాంక్ పాస్‌బుక్, ఈశ్రమ్‌కార్డు వంటి వాటిని చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 18న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తుందని తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన 29న నామినేషన్ల ఉప సంహరణ ఉంటుందని తెలిపారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచేవిధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు సభలు, సమావేశాలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని కోరారు. ఎన్నికలకు 72 గంటల ముందు రాజకీయ పార్టీల నాయకులు ఎలాంటి ప్రచారం చేయకూడదని సూచించారు. అభ్యర్థుల ఖర్చు బ్యాంక్ అకౌంట్ ఆన్‌లైన్ ద్వారా చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, కాశీం అలీ, మదన్‌లాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి రద్దు

లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి యాదావిధిగా కొనసాగుతుందని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం కలెక్టరేట్‌లోని 25వ నెంబర్ గదిలో వినతులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు

నవీపేట, మార్చి 17: సోమవారం నుంచి జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఇన్‌చార్జీ ఎంఈవో గణేష్ రావు తెలిపారు. మోడల్ పాఠశాల ఏ సెంటర్, మోడల్ పాఠశాల బి సెంటర్‌తో పాటు జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, జడ్పీహెచ్ఎస్ జన్నేపల్లి, జడ్పీహెచ్ఎస్ నాళేశ్వర్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మాక్లూర్ మండలం చిక్లీలోని బ్రిలియంట్ పాఠశాల, రెంజల్ మండలానికి చెందిన మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులను కలుపుకుని మండలంలో 620 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన వివరించారు.

రెంజల్ ఎస్సైగా సాయన్న



ఎస్సైగా బాధ్యతలు చేపడుతున్న సాయన్న

రెంజల్, మార్చి 17: రెంజల్ నూతన ఎస్సైగా సాయన్న ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై ఉదయ్‌కుమార్ బదిలీపై ధర్మపురికి వెళ్లడంతో ఆయన స్థానంలో ఆదిలాబాద్ 1వ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహించిన సాయన్న బదిలీపై రెంజల్ ఎస్సైగా వచ్చినట్లు తెలిపారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, మండలంలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

నవీపేట, మార్చి 17: మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రాములు(80) అనే వృద్ధుడిని బైక్ ఢీకొనడంతో ఆదివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక కందకుర్తి రోడ్డు సమీపంలో నవీపేట వైపు నడుచుకుంటూ వస్తున్న రాములును వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయని వెంటనే అతనిని జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని అబ్బాపూర్(ఎం)కు చెందిన పద్మారావు అనే వ్యక్తి బైక్ నడుపగా ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదంలో పద్మారావుకు సైతం తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా.. ప్రమాదం జరిగిన మాట నిజమేనని ఈ విషయంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

వర్ని, మార్చి 17: ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంట చేతికి వచ్చే సరికి అకాల వర్షాలు పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్ని, చందూర్ మండలాల పరిధిలో రైతులు సాగు చేసిన వరి పైరు ఈదురు గాలులు వర్షంతో నేలకొరిగి నీట మునిగాయి. దీంతో పంట ధాన్యం మక్కిన తరుణంలో మొలకెత్తి నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని కర్షకులు వాపోతున్నారు. ఇంతటితో అకాల వర్షాలు తగ్గితే తమకు నష్టం నుంచి బయట పడే ఆస్కారం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నవీపేట, మార్చి 17: మండలంలోని బినోలలో ముత్యాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు చల్లగా ఉండాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



బినోలలో బోనాలు తీస్తున్న దృశ్యం

వన్నెల్(బి)లో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



వన్నెల్(బి) ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముప్కాల్, మార్చి17: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగాప్రారంభమ య్యాయి.ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకం, మండ ఎరాధన, సుదర్శన యాగం, పంచామృతలతో అభిషేకం, స్థాపిక దేవత హవనం చేపట్టారు. ఆల యంలో వేదమంత్రోచ్చరణాలతో మొదటి రోజు ఉత్సవాలు నిర్వహించారు. బ్రహ్మోత్స వాలలో భక్తులు, గ్రామసులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

ముందుకు సాగని గిరిజన పాఠశాల నిర్మాణ పనులు



నిర్మాణం ఆగిపోయిన గిరిజన గురుకుల పాఠశాల

సిరికొండ మార్చి 17 : మూడేళ్లుగా గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయి. సిరికొండ మండలం చీమన్‌పల్లి గ్రామంలో గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కృషి వల్ల రూ.4.20 కోట్ల నిధులు మూడున్నరేళ్ల కిత్రం మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించిన నేటికి పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఆర్మూర్ పట్టణంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. చీమన్‌పల్లి గ్రామం అభివృద్ధి చెందడానికి బాజిరెడ్డి గోవర్ధన్ గిరిజన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సుమారు ఆరున్నరేళ్ల క్రితం ప్రభుత్వానికి నచ్చ చెప్పి మంజూరు చేయించారు.అయిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుక రావడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.పాఠశాల ప్రారంభమయిన మొదట్లో కొంత కాలం చీమన్‌పల్లి గ్రామంలో అద్దె భవనంలో కొనసాగించినప్పటికీ సరియైన సౌకర్యాలు లేవనే కారణంలో పాఠశాలను ధర్పల్లికి తరలించారు.ఇదే పాఠశాలకు అనుబంధంగా జూనియర్ కళాశాలను కూడ ప్రభుత్వం మంజూరు చేసింది. ధర్పల్లిలో కూడ భవనం సరిపోనందున అధికారులు పాఠశాలను, కళాశాలను ఆర్మూర్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యాబోధన ఆర్మూర్‌లో జరుగుతోంది. దీంతో బాజిరెడ్డి గోవర్ధన్ అప్పట్లో చీమన్‌పల్లి గ్రామస్థులతో చర్చించి కావలసిన స్థలాన్ని కొనుగోలు చేయించారు. ప్రభుత్వం భవన నిర్మాణానికి నాలుగు కోట్ల ఇరువై లక్షల నిధులను మంజూరు చేయించింది. బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన కూడ చేశారు. పనులు ప్రారంభించగానే అటవీ శాఖ అధికారులు వచ్చి నిర్మాణ పనులను నిలిపివేశారు. అటవీ శాఖ అధికారులతో గిరిజన కార్పొరేషన్ అధికారులు,బాజిరెడ్డి గోవర్ధన్ చర్చించి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు.మొదట్లో పనులు వేగంగా జరిగినప్పటికి రాను రాను నత్త నడకను మరిపించేలా పనులు జరుగుతున్నాయి.నిధులు విడుదల కాకపోవడమో లేక మరే కారణమో కాని పనులు మందకోడి జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈమధ్య కాలంలో అయితే పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు చెపుతున్నారు.ఆర్మూర్‌లో కూడవిద్యార్థులకు కావాలసిన సౌకర్యాలు కూడ లేవని తెలుస్తోంది. నూతనంగా ఎన్నికైన స్థానిక శాసనసభ్యులు భూపతిరెడ్డి చొరవ చూపించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి

అధికారులు స్పందించి గిరిజన గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నిధులున్న పనులు పూర్తి కాకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● భవనాల నిర్మాణం పూర్తయ్యేదెన్నడూ...

విద్యార్థులకు సరియైన సౌకర్యాలు ఇతర మౌలిక సదుపాయలు కల్పించాలనే లక్ష్యంతో భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికి పనులు పూర్తి చేయించడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టోచ్చినట్లు కనిపిస్తుంది. పనులు ప్రారంభించి సుమారు మూడున్నరేళ్లు కావస్తున్న ఇంకా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. పనులను సకాలంలో పూర్తి చేయించడంలో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో లేక ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు నిధులు విడుదల చేయక పోవడం వల్లనో కాని మూడున్నరేళ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పనులు సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కొట్టోచ్చినట్లు కనిపిస్తూనే వుంది

పనుల్లో నాణ్యతను పాటించాలి

పనులు చేయడంలో సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతను పాటించాలని ప్రజలు కోరుతున్నారు. స్లాబ్ పనులతో పాటు గోడల నిర్మాణంలో చేసే పనుల్లో సరియైన నాణ్యతను పాటించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు పనులను నాణ్యతగా చేయించాలని కోరతున్నారు. వివరణ కోసం సంబంధిత ఏఈ సురేందర్‌రెడ్డికి ఫోన్ చేయగా చేసిన పనులకు నిధులు విడుదల కాకపోవడం వల్లె కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని చెప్పారు. భవన నిర్మాణ పనులు ప్రారంభం అయిన నాటి నుంచి ఇదే పరిస్థితి ఉందన్నారు.

ఎన్నికల ప్రచార సభలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి

● రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్, సీపీ

నిజామాబాద్ అర్బన్, మార్చి 17: ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం ముందస్తుగానే దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్లు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా రాజకీయ పార్టీల తరఫున కృషి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు, అభ్యర్థులకు ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు అందిస్తామని అయితే కనీసం 48 గంటల ముందు సువిద పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికే అనుమతి ఉంటుందని రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు, లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీల్లేదని మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ విద్వేశాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం నిషేదమన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ప్రచారం నిర్వహించవద్దన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని దీన్ని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన రేట్ చార్ట్ ప్రకారం ఎన్నికల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మెంట్రాజ్‌పల్లిలో బోనాల ఊరేగింపు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

డిచ్‌పల్లి, మార్చి 17: మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం పురష్కరించుకొని గ్రామ ముదిరాజు సంఘం సభ్యులు బోనాలు, నైవేద్యాలు సమర్పిం చుకున్నారు.ఈఏడాది పాడిపంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురువాలని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధికి సన్మానం

ఆర్మూర్‌టౌన్ , మార్చి17: మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాదర్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సన్మానించారు. ఇటీవల జిల్లా అధికార ప్రతినిధిగా నియామించబడిన గంగాధర్‌ను పట్టుశాలువతో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొట్టాల సుమన్, కేసీ.ముత్తెన్న, దార్ల చిన్న ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్

ఆటో బోల్తా ఇద్దరికి గాయాలు

జక్రాన్‌పల్లి, మార్చి17: మండలంలోని పడకల్ గ్రామంలో ఆదివారం ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వినాయక్ నగర్ నుంచి ఆటోలో ఆరుగురు కుటుంబసభ్యులు కలిసి భీమ్‌గల్‌లోని లింబాద్రిగుట్టకు మొక్కులు తీర్చుకు నేందుకు ఆటోలో వెళ్తుం డగా పడకల్ గ్రామంలో ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్టు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎఎస్సై సుశీల్‌కుమార్ సందర్శించారు. ఈ విష యమై ఎస్సై సీహెచ్.తిరుపతిని వివరణ కోరగా ఆటో బోల్తా ప్ర మాద విషయమై ఫిర్యాదు రాలేదని తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఆర్మూర్‌రూరల్, మార్చి17: ఆర్మూర్ పట్టణంలోని బదిరుల పాఠశాలలో రోటరీక్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థులకు తనవంతు సేవలు ఎల్లవేళల అంది స్తామన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి పట్వారి తులసీ, కోశాధికారి లక్ష్మీనారా యణ, మాజీ అధ్యక్షుడు పుష్కర్‌రావు, దామోదర్, రాస ఆనంద్, వినాయక్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్, మార్చి17: ఆలూర్ మండల కేంద్రంలోని తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దొంగలు శనివారం అర్థరాత్రి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆలూర్ మండల కేంద్రానికి చెందిన శివలింగం తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వివాహానికి వెళ్ళారు. దీంతో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోనికవ వెళ్లి ఇంట్లోని బీరువను పగులగొట్టి రెండు తులాల బంగారం, రూ.10వేల 500నగదు, వెంటి సామాగ్రిని చోరీ చేసినట్టు తెలిపారు. అనంతరం ఇంట్లో కరం చల్లి పరారీ అయ్యారు. స్థాని కులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మానవత్వానికి జీవం పోయాలి: సీనియర్ సివిల్ న్యాయాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం

ఆర్మూర్‌టౌన్ , మార్చి17: సభ్యసమాజంలో మనుషులు మానవ త్వాన్ని మరిచి పోతున్నారని మానవత్వానికి జీవం పోయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తాన అన్నారు. ఆదివారం పట్టణంలోని చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ లకు ఉచిత ఆపరేషన్‌లు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మానవ సేవే మాదవసేవ అంటు ఎంజె ఆసుపత్రి డాక్టర్ మధుశేఖర్ చేయూత సంస్థ ద్వారా సేవలు చేయడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులను మరిచిపోతున్న సమాజం ఏలాంటి డబ్బులను ఆశించకుండా పేదవారికి సేవ లు చేస్తున్నారని ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకొని తనకు నచ్చిన సేవలను చేస్తూ ముందుకు సాగాలని ఆమె అన్నారు. ఈ ఉచిత క్యాంప్ ద్వారా సుమారు 100 మందికి మహిళలకు ఆపరేషన్‌లు చేసినట్టు డాక్టర్ మధుశేఖర్ తెలిపారు. అనంతరం మహిళ దినోత్సవం సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తానతో పాటు మరి కొందరు మహిళ డాక్టర్‌లను పట్టుశాలువ, పూలమాల, మెమెంటోతో డాక్టర్ మధుశేఖర్ దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు కలిగోట గంగాధర్, బి.నాగరాజు, ఐడియా సాగర్, డాక్టర్ శ్రీలత, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు



సీఎంను కలిసిన అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, మార్చి 17: జిలాకు చెందిన నలుగురు నేతలకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 37 రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు సీనియర్ నేతలకు రాష్ట్రస్థాయి పదవులు దక్కాయి. రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ విప్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్ర కిసాన్‌కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, బాన్సువాడకు చెందిన కాసుల బాల్‌రాజ్‌కు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్లుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమను కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మానాల మోహన్‌రెడ్డి మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

● సంబరాలు

జిల్లాకు చెందిన నలుగురు ముఖ్య నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లుగా ప్రభుత్వం నియమించడంపై జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వైసాక్షి సంతోష్, నరేందర్‌సింగ్, ప్రతాప్, సాయికిరణ్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

మెండోర, మార్చి17: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు డు కొత్తింటి ముత్యంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లాకు చెందిన రాష్ట్ర నా యకులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు రావడంతో టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకొని సం బరాలు జరుపుకున్నారు. ఈ సందర్భం గా మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అ నిల్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరే షన్‌గా మానాల మోహన్‌రెడ్డికి రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ గా అన్వేష్‌రెడ్డికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రక టిం చడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, కొప్పెల రమేస్, మచ్చర్ల మహేందర్, నరేష్, సాయిరాం, వెంకట్, నవీన్, గంగారెడ్డి, సామ గంగారెడ్డి, జీవన్‌రెడ్డి, కండెల చిన్న ముత్యం, నోముల రాజన్న, కొప్పెల కరెంట్ ముత్యం, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ముప్కాల్, మార్చి17: జిల్లాకు చెందిన రాష్ట్ర నాయకులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు రావడంతో ఆదివారం ముప్కాల్, బాల్కొండ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్‌గా, మానాల మోహన్‌రెడ్డికి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా, అన్వేష్‌రెడ్డికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. . ఈ కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ కార్యదర్శి జైడి చంద రవి, జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, కాంగ్రెస్ కార్యదర్శి రాజ్‌వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం గంగారెడ్డి, నరేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కిరోసిన్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, మార్చి17: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో చేపూర్ గ్రామానికి చెందిన బండి గంగాధర్(64) ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎనిమిది నెలల క్రితం పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో అక్కచెల్లెళ్ళ జంట హత్య కేసులో గంగాధర్ నిందితుడు. అప్పట్లో పోలీసులు అరెస్టు చేసి జైల్‌కు పంపగా మూడు నెలల క్రితం బెయిల్‌పై మృతుడు తిరిగి వచ్చాడు. మధుమేహ వ్యాధి గ్రస్తుడైన గంగాధర్ అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్థాపం చెంది గంగాధర్ ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య బండ లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, మార్చి17: మండలంలోని మునిపల్లి గ్రామంలో 63వ జాతీయ హదారిపై బైక్ కిందపడగా మునిపల్లి గ్రామానికి చెందిన మద్రిపల్లి భరత్ కుమార్(23) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై సిహెచ్.తిరుపతి తెలిపిన వివరాలు ప్రకారం మునిపల్లి గ్రామానికి చెందిన భరత్‌కుమార్ బైక్‌పై ఆర్మూర్ వైపు వెళ్తుండగా అదుపుతప్పి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. ఆర్మూర్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతుం డగా ప్రమాదకరంగా ఉండడంతో నిజామాబాద్ జిల్లాకు తరలించారు. చికిత్స పొందుతూ భరత్‌కుమార్ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.


పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

బెల్టు దుకాణంపై పోలీసుల దాడి

కామారెడ్డి టౌన్, మార్చి 17: కామారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో బెల్ట్ దుకాణంపై పోలీసులు దాడులు నిర్వహించి 29 బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ధాత్రిక ప్రభాకర్ అనే వ్యక్తి తన ఇంటిలో అక్రమంగా మద్యం నిల్వ ఎంచి ఎక్కువ రేటుకు మద్యాన్ని అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది దాడులు చేయగా 29 బాటిళ్ల మద్యం లభ్యమైందని తెలిపారు. ఎవరు కూడా అనుమతి లేకుండా మద్యాన్ని అమ్మకూడదని ఒకవేళ అలా చేసినచో వారిపైన చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాచారెడ్డి ఊర చెరువులో మృతదేహాల లభ్యం

మాచారెడ్డి, మార్చి 17: మండలంలోని రత్నగిరిపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య(35) ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నర్సయ్యకు అతని భార్యకు మధ్య విభేదాలు తలెత్తడంతో గత ఏడాది నుంచి మృతుడి భార్య మాచారెడ్డిలోని ఆమె తల్లిగారింటి వద్ద ఉంటుంది. ఈనెల 15న ఇంట్లోంచి వెళ్లి మాచారెడ్డి చేరుకుని కాలకృత్యాల కోసం చెరువు కట్టకు వెళ్లగా కాలు జారి నీటిలో పడిపోయి మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా అదేచెరువులో మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన మారాటిలక్ష్మి(42) మృతి చెందింది. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే లక్ష్మి ఈనెల 15న ఉదయం కూలి పనులకు వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి మాచారెడ్డి చౌరస్తాకు వెళ్లింది. రాత్రి అయిన ఇంటికి తిరిగిరాలేదని చుట్టు పక్కల ఆచూకీ లభించకపోవడంతో పాటు ఆదివారం సాయంత్రం శవమై చెరువులో తేలింది. ప్రమాదశాత్తు నీటి లో పడిందని మృతుడి భార్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలి

రామారెడ్డి, మార్చి 17: బతుకు దెరువు కోసం దుబాయికి వెళ్లిన రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఒంటరి మల్లేష్‌రెడ్డి(37) లివర్ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ ఈనెల 10న మృతి చెందాడు. దుబాయ్‌లో ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేష్‌రెడ్డికి లివర్ సంబంధిత వ్యాధితో మృతి చెందగా అతని మృతదేహం కోసం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. మల్లెష్‌రెడ్డి మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రజాప్రతినిధులు,అధికారులు సహకరించాలని కుటుంబీకులు కోరుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్ఐ

గాంధారి, మార్చి 17: గాంధారి మండలం గండిపేట గ్రామానికి చెందిన పెద్దపురం రాజు(18) అనే రైతు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. రాజు తన సొంత వ్యవసాయ పొలం వద్ద వరి పంటకు నీళ్లు పారించడానికి స్టార్టర్ పెట్టె వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు వైర్ చెయ్యికి తగిలి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్న వయస్సులోనే రాజు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గంగారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

'పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

సదాశివనగర్, మార్చి 17: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు బకాయిపడిన వేతనాలు ఏడు నుంచి ఎనిమిది నెలల వరకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని 51వ జీవో సవరించాలని మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ కార్మికులు ఈనెల 21న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో కమిషనర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, సాయిలు, మల్లేష్, శ్రీను, రవి, ఎల్లయ్య, సంగమేశ్వర్, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం

కామారెడ్డి టౌన్, మార్చి 17: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఈనెల 18 నుంచి 30 వరకు విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని డిపో మేనేజర్ ఇందిరా తెలిపారు. విద్యార్థులను గమ్య స్థానాలకు చేర్చేందుకు కండక్టర్, డ్రైవర్‌లు ప్రత్యేక శ్రద చూపాలని సూచించారు.

జగద్గురువును దర్శించుకున్న కేంద్ర మంత్రి

మద్నూర్, మార్చి 17: జుక్కల్ మండలంలోని దోస్‌పల్లి తెలంగాణ ఉప పీఠానికి వచ్చిన స్వామి జగద్గురు నరేంద్ర మహారాజ్‌ను కేంద్ర మంత్రి కూబ్‌తో పాటు ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే దర్శించుకున్నారు. జగద్గురు మాట్లాడుతూ ధర్మాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ కట్టుదిట్టంగా ఉండాలన్నారు. ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేసే భాగ్యం ప్రజలు కల్పించినందుకు ధన్యవాదాలన్నారు. ప్రజా ప్రతినిధులకు నిర్వాహకులు సన్మానించారు.


మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

బీజేపీని మరింత పటిష్టం చేస్తా

● ఎంపీ బీబీ పాటిల్

నిజాంసాగర్, మార్చి 17: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మరింత అభివృద్ధి చేస్తానని, బీజేపీని పటిష్టం చేసేందుకు ప్రతీ కార్యకర్త మరింత కష్టపడి పని చేయాలని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. ఆదివారం జుక్కల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజాంసాగర్ మండలం నుంచి ఆయా పార్టీల నుంచి బీజేపీలో నాయకులు, కార్యకర్తలు చేరగా, వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం అందేలా కృషి చేస్తా..

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి


భిక్కనూరులో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

భిక్కనూరు, మార్చి 17: వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన ప్రతీ రైతుకు నష్ట పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేసేలా కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతీ రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని, కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపుగా 25 గ్రామాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి నియోజకవర్గంలో ఎన్ని ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయో వివరాలను అడగడం జరిగిందని, ఈదురు గాలులకు నియోజకవర్గంలో విద్యుత్ స్తంభాలు పడటం, చెట్లు విరగడంతో విద్యుత్ సమస్య తలెత్తిందని అన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు విద్యుత్ అధికారులు కృషి చేస్తున్నారని వారికి సహకరించాలన్నారు. రాష్ట్రంలో ఫసల్ బీమా వర్తింపజేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రంలో శనివారం రాత్రి కురిసిన అకాలవర్షం, వడగండ్ల వానలతో పంటలు నేలకొరగడంతో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగండ్లవానతో నష్టపోయిన మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించి అధికారులకు ఫోన్ చేసి నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా చూస్తానని వారికి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని గొట్టిముక్కుల, సంగమేశ్వర్ గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల సర్వే నిర్వహించి నివేదిక అందజేస్తారని తెలిపారు. ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందేవిధంగా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


రాజంపేటలో..

నేత్ర పర్వంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం

బీర్కూర్, మార్చి 17: బీర్కూర్ శివారు, తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ముక్కోటి దేవతల సాక్షిగా శ్రీదేవి, భూదేవి సమేత, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. శ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారి పర్యవేక్షణలో వేద పండితులు పెళ్లి తంతును నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీవారి కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మ కర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, శంభురెడ్డి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు కన్నులారా తిలకించి తరించారు. గోవిందా గోవిందా నామస్మరణతో భక్తి పారవశ్యంలో ఉనిగి తేలారు. పెళ్లి ఘట్టం ముగిసిన అనంతరం శ్రీవారు హనుమాన్ వాహనంపై ఆసీనులై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీవారు ఆసీనులైన రథాన్ని భక్తులు తాల్లాతో లాగుతూ ముందుకు సాగారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డీవీవీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అప్పారావు, మురళి, నరస రాజు, సత్యనారాయణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


టీటీడీలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో అకాల వర్షంతో అపార నష్టం


కిష్టాపూర్‌లో వరి పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం


తాడ్వాయిలో మృత్యువాత పడిన పశువులు

బీర్కూర్, మార్చి 17: మండలంలో శనివారం సాయంత్రం బలమైన ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. దీంతో చేతికొచ్చిన వరి పంట నేలపాలైంది. బీర్కూర్ మంల వ్యాప్తంగా 12 గ్రామాల పరిధిలో సుమారు ఐదు వేల ఎకరాల వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారిని కమల తెలిపారు. ఈ నష్టం పెరిగే అవకాశం ఉందని అన్నారు. బీర్కూర్ మండలంలో దామరంచ , రైతునగర్, అన్నారం, చించొల్లి, కిస్టాపూర్, బీర్కూర్, నాగాపూర్, మల్లాపూర్, సాంబాపూర్, బరంగేడ్గి, బైరాపూర్, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో వడగళ్ళతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల శివారులలో గల వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరో వారం రోజుల్లో ఇంటికి వస్తుందని అనుకున్న వరి పంటలు నేల పాలయ్యాయి. వడగళ్ళ వానకు ధాన్యం గింజలు మొత్తం రాలిపోయి, కేవలం గడ్డి మాత్రమే మిగిలింది. బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో వరి పంట నేల వాలింది. ధాన్యం రాలిపోవడంతో పంట కోయడానికి కూడా పనికి రాకుండా పోయిందని అన్నదాతలు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్ట పరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎకరానికి 20వేల చొప్పున పరిహారం అందించాలి..

బీర్కూర్: మండలంలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి అన్నదాతలు ఆదుకోవాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన బీర్కూర్ మండలంలోని దామరంచ, అన్నారం, చించోల్లి, కిష్టాపూర్, బీర్కూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. రైతులు, రెవెన్యూ వ్యవసాయ శాఖల అధికారులతో కలిసి వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలు పరిశీలించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా వరి పంటలకు తీవ్ర స్థాయిలో నష్టం వాటిల్లిందని, వెంటనే సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌ను వ్యవసాయ శాఖ అధికారిని కోరారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షాల ధాటికి వరి పంటలు నేలవాలాయని అన్నారు. ఆదాయం మాట దేవుడు ఎరుగు పెట్టిన పెట్టుబడి కూడా రైతులకు రాని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరానికి 20 ఎకరాల చొప్పున పంట నష్టం పరిహారం అందించి, అన్నదాతలను ఆదుకోవాలని కోరారు.

నిజాంసాగర్: నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి పంట దెబ్బతిన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్లు, అకాల వర్షానికి చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయని, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు నివేదికలు తయారు చేయాలని కోరారు. వరి పంటతో పాటు మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయాయని, ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలని పేర్కొన్నారు.

మద్నూర్: మద్నూర్, డోంగ్లీ ఉమ్మడి మండలాల్లో అకాల వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా అకాల వర్షం కురియడంతో రైతన్నల పంటలు నష్టపోయాయి.ప్రాథమిక సమాచారం మేరకు ఉమ్మడి మండలాల్లో వరి 512 ఎకరాలు, మొక్కజొన్న 432 ఎకరాలు, తెల్ల జొన్న 74 ఎకరాలు నష్టపోయినట్లు మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు పంటలు పరిశీలించి, పూర్తి నివేదిక జిల్లా అధికారులకు సమాచారం అందిస్తామన్నారు.

తాడ్వాయి: మండలంలో శనివారంరాత్రి కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంట భారీగా దెబ్బతింది. దాదాపు 500 ఎకరాలలో పంట నేలవారడంతో రైతులులబోదిబోమంటున్నారు. 100 ఎకరాలలో వరిపంట తీవ్రంగా దెబ్బతింది. మండలంలోని బ్రహ్మజీవాడి గ్రామంలో రాత్రి కురిసిన వర్షానికి గ్రామంలోని ఎర్రోళ్ల రమేష్ రావుకు చెందిన రెండు ఆవులు, మూడు దూడలుమృత్యువాత పడ్డాయి.మరో నాలుగు గేదెలు, 10దూడల నడుములు విరిగిపోయాయి. గ్రామశివారులో వేసుకున్న షెడ్డులో గాలివానకు ప్రమాదవశాత్తు గోడకూలి ఆవులు,దూడలు మృతిచెందినట్లు గ్రామస్తులు తలెపారు.దాదాపు రూ.4లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.అదేగ్రామంలో పట్లోళ్ల ప్రసాద్‌రావుకు చెందిన కోళ్లఫారం బాగా దెబ్బతింది. కోళ్లఫారంలో ఉన్న రెండువేల కొడిపిల్లలు మృత్యువాత పడ్డట్లు గ్రామస్తులు తెలిపారు.నందివాడ,దేమికలాన్, కరడ్‌పల్లి, బ్రహ్మణపల్లి, చందాపూర్, ఎర్రపహాడ్, కృష్ణాజీవాడిగ్రామాలలో పంటలు బాగా దెబ్బతిన్నాయి.అధికారులు స్పందించి బాధిత రైతులకు తగిన న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

బీబీపేట: మండలంలోని పలు గ్రామాలలో శనివారం రాత్రి గాలి వానబీభత్సం సృష్టించాయి.బీబీపేట శ్రీగాథ మధ్యగల రహదారిలో చెట్టుకూలి రోడ్డుకు అడ్డుపడడంతో వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం కావడంతో అధికారులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో చెట్లను తొలగించేవారేలేరని వాహన దారులు అసహనం వ్యక్తం చేశారు. ఆకస్మాత్తుగా వచ్చిన వర్షం వల్ల రైతులు ఆందోళన గురయ్యారు.

రాజంపేట: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం రాత్రి ఈదురుగాలులు,అకాలవర్షానికి మొక్కజొన్న, వరిపంటలు నీటమునిగి నేలవాలాయి. చేతికొచ్చిన పంటలు పూర్తిగా నేల మట్టం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.కూరగాయాలు, ఆకు కూరలు, ఉల్లిగడ్డల పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. రాజంపేట, తలమడ్ల, ఆరేపల్లి, బస్వన్నపల్లి, శివాయిపల్లి గ్రామాలలో వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయి. పంటలు చేతికొచ్చే దశలో పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులతో పంటనష్టాన్ని అంచనావేసి రైతులకు తగిన ఆర్థికసాయం అందించేలా కృషిచేయాలని కోరుతున్నారు.

పంట నష్టపోయిన ప్రతీ రైతుకు రూ.50వేల నష్టపరిహారం అందజేయాలి

● మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూరు, మార్చి 17: అకాల వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వ నష్టపరిహారం అందజేయాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి, అంతంపల్లి, లక్ష్మీదేవునిల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతులకు నష్టపరిహారం వెంటనే అందజేసి రైతులను ఆదుకోవాలన్నారు. భిక్కనూరు, దోమకొండ, రాజంపేట, కామారెడ్డి మండలాల్లో వేల ఎకరాల్లో పంటలు, వివిధ రకాల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల సాగుకు అప్పు చేసిన రైతులకు ఈ వడగండ్లు కన్నీళ్లు మిగిల్చాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్లు వెంకట్‌రెడ్డి, భూంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ మధు మోహన్‌రెడ్డి, అందె మహేందర్‌రెడ్డి, నర్సారెడ్డి, రవీందర్‌రెడ్డి, గంగారెడ్డి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

● మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

బీర్కూర్, మార్చి 17: అకాల వర్షాల వల్ల వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, దెబ్బతిన్న పంటలకు పంట నష్ట పరిహారం అందించి అన్నదాతలను ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన రైతులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బీర్కూర్ మండలంలో వడగళ్ళ వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే పంట పొలాలను పరిశీలించి పంట నష్టం వివరాలను సేకరించి రిపోర్టు అందజేయాలని అన్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి, జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిహారం అందిస్తాని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ వల్లే నేడు రైతులకు నష్టం వాటిల్లుతుందని విమర్శించారు. ఫసల్ భీమాను ఆనాడే అనుమతిస్తే ఈ రోజు నష్ట పోయిన రైతులకు పరిహారం అందేదన్నారు. అయినా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పరిహారం అందిస్తామన్నారు.

మద్నూర్ ఎస్సైగా శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

మద్నూర్, మార్చి 17: మండల సబ్ ఇన్స్‌పెక్టర్‌గా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. గత రెండు నెలలుగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పేకాట ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. తన హయాంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

తాడ్వాయి,మార్చి 17: మండలంలో బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన బీజేపీ అధ్యక్షుడిగా వెల్మసంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యాదగిరి, పత్తిరమేష్,నర్సారెడ్డి, ప్రధానకార్యదర్శిగా తిరుపతిరెడ్డి, సాకలి నర్సింలు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగాదత్తు, కిసాన్‌మోర్చా అధ్యక్షునిగా రవీందర్‌రెడ్డి, మోర్చా అధ్యక్షుడిగా స్వామిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రవీందర్‌రావు, మాజీ అధ్యక్షుడు వెంకట్‌రావు, గంగారెడ్డిహోటల్ శ్రీను పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), మార్చి 17: మహ్మద్‌నగర్ మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

మహ్మద్‌నగర్‌లో 33 లీటర్ల మద్యం పట్టివేత

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), మార్చి 17: మహ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో సాయిబాబా అనే వ్యక్తి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండటంతో సమాచారం అందుకుని దాడులు చేసినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 33 లీటర్ల మద్యం లభించినట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

పాఠశాల భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ, మార్చి 17: పరీక్షల భయంతో పాఠశాల భవనంపై నుంచి దూకి ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బాన్సువాడ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బోర్లం గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పరీక్షల భయంతో పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర గాయాల బారిన పడిన ఆ విద్యార్థినిని బాన్సువాడ ఏరియా స్పత్రిలో చికిత్స అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

అకాల వర్షంతో అన్నదాత ఆగమాగం

దోమకొండ, మార్చి 17: మండలంలోని లింగుపల్లి, గొట్టిముక్కుల, దోమకొండ, ముత్యంపేట, కుందారం, గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వడగండ్ల వర్షానికి వరి పంట నేలవాలింది. మొక్కజొన్న పంట విరిగిపడిపోయింది. ఇండ్లపై, గుడిసెలపైన వేసుకున్న రేకులు ఎగిరిపోయి 100 మీటర్ల దూరంలో పడిపోయాయి. గొట్టిముక్కుల గ్రామ శివారులో ఉన్నటువంటి ఇటుకబట్టి వద్ద ఉన్నటువంటి ఉనుక తీసుకెళ్లె ట్రాక్టర్ ట్రాలీ గాలీకి బోల్తా పడింది. వ్యవసాయభావుల వద్ద ఉన్నటువంటి కేజీవీల్స్ గాలికి కొంత దూరం వరకు కోట్టుకుపోయాయి. విద్యుత్ స్థంభాలు విరిగిపడిపోయాయి. చెట్లు విరిగి రోడ్లపై పడిపోవడంతో కొన్ని గ్రామాలకు ఆదివారం ఉదయం 10 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు. కళ్లముందే పంటలు నేలవాలిపోవడంతో రైతుల ఆదోళన చెందుతున్నారు.. నేలవాలిన పంటలను ఏవో పవన్ కుమార్, ఏఈవోలు శ్రీలత,క్రిష్ణారెడ్డిలు రైతులతో పరిశీలించారు.

ఏఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్‌గా శ్రీనివాస్

బాన్సువాడటౌన్, మార్చి 17: సామాజిక కార్యక్రమాలు నిర్వహించే సంస్థ ఏఎస్ఆర్ ఫౌండేషన్ నూతన చైర్మన్‌గా ప్రముఖ వ్యాపారవేత్త మోహరిల్ శ్రీనివాస్‌రావును ఎన్నుకున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు సంతోష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో చైర్మెన్‌ను సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన చైర్మెన్ మోహరిల్ శ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, అభివృద్ధి అనే నినాదంతో మున్ముందు అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సభ్యులందరూ కూడా సామాజిక బాధ్యతతో మెలగాలని, యాశీలకంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బంగారు రవి, బాలు, రాజారాం, సాయిలు, రాజు తదితరులున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - రజాకార్
శాంతి - ప్రేమలు
ప్రియా 70 - భీమ
ప్రియా 35 - తంత్ర

బాన్సువాడ

మహేశ్వరి - భీమ
వెంకటేశ్వర - రజాకార్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

